పూర్వ విద్యార్థులు

విద్యార్థుల అ'పూర్వ' సమ్మేళనం..

కేసముద్రం, డిసెంబర్ 10 : మండల కేంద్రంలోని ప్రభుత్వం పాఠశాలలో 1998-99 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం మండల కేంద్రంలోని రెడ్డి ఫంక్షన్ హాల్‌లో సమ్మేళనం నిర్వహించారు. ముందుగా విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు. అనంతరం ఆనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రంగాచారి, ఉపేందర్‌రెడ్డి, మల్లయ్య, నజీరుద్దీన్, విజయ్‌కుమార్, రాజమౌళి, ఉమాబాబు, రమేశ్ రెడ్డి, విద్యార్థులు పిన్ని రాము, విజయ్, శ్రీను, హరీశ్, యాకాంతాచారి, రమేశ్, ప్రసాద్, బిచ్చానాయక్, రహీమ, మంజుల, రజిత, సుభాషిణి, కవిత, మాదవి, అరుణ, ప్రభావతి ఉన్నారు.

ప్రశాంతంగా ముగిసిన ఎన్ఎంఎంఎస్ పరీక్ష

మహబూబాబాద్ రూరల్, డిసెంబర్ 10 : జిల్లా పరిధిలోని ఆదివారం నిర్వహించిన నేషనల్ మీన్ మినట్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని జిల్లా విద్యా శాఖ అధికారి రామారావు పేర్కొన్నారు. జిల్లా పరిధిలోని పట్టణ కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, బాలుర ఉన్నత పాఠశాల, తొర్రూరు పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సెయింట్ పాల్స్ హైస్కూల్ నందు పరీక్షను నిర్వహించనున్నట్లు తెలిపారు. మొత్తం 678 మంది విద్యార్థులకు గాను 657 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని తెలిపారు. విద్యార్థులకు కాంపిటేటివ్ పరీక్షపై ఆసక్తి పెరుగుతందన్నారు. ప్రతి విద్యార్థి పరీక్షలకు హాజరయ్యేలా పాఠశాల హెచ్ఎంలు చూడాలని తెలిపారు.

రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు ఎంపిక..

కురవి, డిసెంబర్ 10 : రాజోలు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం రవికుమార్ ఆదివారం తెలిపారు. నర్సంపేట మండలం మధనపేట జడ్పీహెచ్ఎస్ పాఠశాల అండర్ -14 బాలుర విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీలకు రాజోలు విద్యార్థులు ధరావత్ కిశోర్, మూడు వంశీలు ఎంపికైనట్లు తెలిపారు. ఈ నెల 11 నుంచి 13 వరకు రంగారెడ్డి జిల్లాలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలో విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. ఉపాధ్యాయులు, రాజోలు సర్పంచ్, ఎస్ఎంసీ చైర్మన్ విద్యార్థులను అభినందించారు.

అంబేద్కర్ ఫెలోషిప్ అవార్డు అందుకున్న గోపినాథ్

అంబేద్కర్ ఫెలోషిప్ అవార్డు అందుకున్న గోపినాథ్

గూడూరు, డిసెంబర్ 10 : మండలంలోని ఏపూరు గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు వాంకుడోత్ గోపినాథ్ 2023 సంవత్సరం అంబేద్కర్ ఫెలోషిప్ అవార్డును అదుకున్నారు. ఆదివారం జాతీయ మానవ హక్కుల దినోత్సవం పురస్కరించుకుని న్యూ ఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో భారతీయ దళిత సాహిత్య అకాడమి వారు అంబేద్కర్ ఫెలోషిప్ అవార్డు అందజేశారు. ఒక్కరు మారినా చాలు పౌండేషన్ ఆధ్వర్యంలో సమాజ సేవ చేస్తూ ఉపాధ్యాయ వృత్తిలో కూడా పలు సేవలను అందించినందుకు గానూ ఆవార్డును భారతీయ దళిత సాహిత్య అకాడమి నేషనల్ ప్రెసిడెంట్ ఎస్పీ సుమనక్షర్ చేతుల మీదుగా అందుకున్నారు. ఆవార్డు లభించడంపై గోపినాథ్ ఆనందం వ్యక్తం చేస్తూ మరిన్ని సేవలు అందించనున్నట్లు తెలిపారు.

పూజారికి ఆర్థిక సాయం అందజేత

గూడూరు, డిసెంబర్10 : మండల కేంద్రంలోని శివాలయంలో పూజారిగా పనిచేస్తున్న సతీశ్ పాండేకు పీఏసీఎస్ చైర్మన్ చల్లా లింగారెడ్డి ఆదివారం ఆర్థిక సాయం అందజేశారు. సతీశ్ పాండే కూతురుకు మెదడుకు సంబంధించిన జబ్బు రావడంతో ముంబాయిలోని ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతున్నది. జీవనోపాధి కోసం కాశీ నుంచి వచ్చి స్థానిక సనాతన శివాలయంలో పూజారిగా పని చేస్తున్న సతీశ్ పాండే చిన్నారి చికిత్స కోసం ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఈ క్రమంలో మండలంలో కొంతమంది దాతలు ముందుకు వచ్చి చిన్నారి చికిత్స కోసం సాయం చేస్తున్నారు. ఈ క్రమంలో విషయం తెలుసుకున్న పీఏసీఎస్ చైర్మన్ చల్లా లింగారెడ్డి తన సొంతంగా చిన్నారి చికిత్స కోసం రూ.15 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ రవీందర్‌రెడ్డి, గ్రామపెద్దలు కత్తి స్వామి, వెంకన్న, యాకయ్య, నగేశ్ పాల్గొన్నారు.

'మహాలక్ష్మి'ని సద్వినియోగం చేసుకోవాలి

ఎమ్మెల్యే డాక్టర్ మురళీ నాయక్

మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీనాయక్

మహబూబాబాద్ రూరల్, డిసెంబర్ 10 : ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెట్టిన మహాలక్ష్మీ పథకాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ మురళీ నాయక్ సూచించారు. ఆదివారం పట్టణ కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద మహిళల కోసం ఏర్పాటు చేసిన బస్సును ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం మహిళల కోసం కల్పించిన బస్సు సౌకర్యం ఎంతో ప్రయోజనం కలుగుతుందన్నారు. నేడు అనేక మంది విద్యార్థులు ఆర్థికంగా లేక తమ చదువులు మధ్యలోనే ఆపేస్తున్నారని, అలాంటి విద్యార్థుల సమస్యలు తీరి పోతాయన్నారు. ఆలయాలకు, దూర ప్రాంతాలకు వెళ్లే మహిళలకు ఎంతో లాభం చేకూరుతుందన్నారు. జీరో టిక్కెట్‌తో ఆర్టీస్ బస్సులో ప్రయాణం చేయవచ్చన్నారు. అనంతరం ఆయనను ఆర్టీసీ ఉద్యోగులు, పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం శివప్రసాద్, డీఆర్డీఏ పీడీ సన్యాసయ్య, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు భరత్‌చంద్ర రెడ్డి, పట్టణాధ్యక్షుడు పోతురాజు, వార్డ్ కౌన్సిలర్ బుజ్జి వెంకన్న, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఆలయాల్లో సామూహిక వ్రతాలు

కురవి, డిసెంబర్ 10 : కురవి భద్రకాళీ సమేత శ్రీ వీరభద్ర స్వామి ఆలయంలో ఆదివారం మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మురళీ నాయక్ కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు. అనంతరం వీరభద్ర స్వామికి ప్రత్యేక పూజలు చేశారు.

సామూహిక వ్రతాలు..

మహబూబాబాద్: గాయత్రీ ఆలయంలో ఆలయ ప్రధానార్చకుడు జలేంద్రాచార్యులు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కేంద్రం సహా పరిసర ప్రాంతాల మహిళలు అత్యధికంగా పాల్గొన్నారు. అనంతరం భక్తులకు ఆలయ పూజారి తీర్థప్రసాదాలను అందజేశారు. కార్తీక మాసంలో సత్యనారాయణ స్వామి వ్రతం చేయడం ఆలయంలో ఆచారంగా వస్తుందని అర్చకులు తెలిపారు.

కేసముద్రంలో..

కేసముద్రం: పరమ పూజ్య గణపతి సచ్చిదానంద స్వామీజీ వారి దివ్య ఆశీస్సులతో మండల కేంద్రంలోని రామ మందిరంలో సామూహిక శ్రీ అనఘా వ్రతాన్ని దత్త భక్తులు స్వీకరించారు. సుమారు వంద మంది దంపతులు పాల్గొని పూజలు చేశారు. తొనుపునూరి వెంకటేశ్వర్లు, డా. చంద్రశేఖర్, మడూరి లింగమూర్తి, ఏకాంతం, లేగల భాస్కర్‌రెడ్డి, కొప్పుల శంకర్, వంశీ, విజయ్, రాజ్‌కుమార్, వీరన్న, శీలం శ్రీనివాస్, వాసు తదితరులు ఉన్నారు.

మహబూబాబాద్ : సత్యనారాయణ వ్రతంలో పాల్గొన్న భక్తులు

కేసముద్రం :సామూహిక వ్రతంలో పాల్గొన్న భక్తులు

పంట నష్ట పోయిన రైతులను ఆదుకోవాలి

మహబూబాబాద్ రూరల్, డిసెంబర్ 10 : తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న పంటలను పరిశీలించి, నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు గుగులోత్ నందులాల్ నాయక్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల పరిధిలోని మల్యాల గ్రామ శివారు రేగడితండా, బావుసింగ్ తండాలో నష్ట పోయిన వరి పంటలను పరిశీలించారు. పంటలకు నష్ట పరిహారంను, తడిసిన ధాన్యంను ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. పంటలకు బీమాను ప్రవేశ పెట్టి రైతులను ఆదుకోవాలని కోరారు. రాంబాబు, సురేశ్, వినోద్, లింగనాయక్ పాల్గొన్నారు.

వర్షానికి నేలవాలిన పంటను పరిశీలిస్తున్న సేవాలాల్ సేన నాయక్

నేడు గ్రీవెన్స్ డే ..

మహబూబాబాద్, డిసెంబర్ 10 : నేడు గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ శశాంక తెలిపారు. జిల్లాలోని ప్రజలందరూ ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రాష్ట్ర శాసనసభ ఎన్నికల కారణంగా చాలా రోజులుగా గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించలేదని, ఇక నుంచి ప్రతి సోమవారం గ్రీవెన్స్‌ను నిర్వహిస్తామని వివరించారు. జిల్లాలోని ప్రతి గ్రామంలో సమస్యలను ప్రజల తమ సమస్యలు, విజ్ఞప్తులు పరిష్కరించకునేందుకు దరఖాస్తులు అందించవచ్చన్నారు.

ఆర్యవైశ్యుల వన మహోత్సవం..

వాసవీ మాతకు పూజలు చేస్తున్న ఆర్యవైశులు

బయ్యారం, డిసెంబర్ 10: మండలంలోని చర్లపల్లి శివారులోని మామిడి తోటలో ఆర్యవైశ్యులు వన మహోత్సవం నిర్వహించారు. మహిళలు వాసవీ మాత, ఉసిరి చెట్టుకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం చిన్నారులు ఆటా పాటా, మహిళలు కోలాట నృత్యాలతో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశులు నాగయ్య, నాగేశ్వరావు, కోటేశ్వరావు, సత్యనారాయణ, శ్రీను, వేణు, వెంకటేశ్వర్లు, హనుమంతరావు, వెంకన్న, భిక్షం, పూర్ణ, మధు పాల్గొన్నారు.

108లో ప్రసవం..

బయ్యారం, డిసెంబర్ 10 : మండలంలోని కొత్తగూడెం గ్రామానికి చెందిన ఓ మహిళ ఆడ బిడ్డకు జన్మనించింది. గర్భిణి చందనకు ఆదివారం పురిటి నొప్పులు రావడంతో 108కు సమాచారం అందజేశారు. వెంటనే ఈఎంటీ నరేశ్, పైలట్ ప్రశాంత్ గ్రామానికి చెరుకుని, చందనను దవాఖానకు తరలిస్తుండగా, ఈ క్రమంలో నొప్పులు అధికం కావడంతో వాహనంలో బిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డా క్షేమంగా ఉన్నారు. సిబ్బంది గంధంపల్లి దవాఖానకు తరలించారు.

ప్రసవించిన బిడ్డను అప్పగిస్తున్న సిబ్బంది